andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 • కనిష్ఠం 12.8
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 15 డిసెంబరు 2024



నిర్మల్ - జగిత్యాల జిల్లాలను కలిపే సదర్‌మాట్ బ్యారేజీ రోడ్డు ఇదే

లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ నిర్మాణం కోసం పనులు చేపడుతున్న దృశ్యం

# శరవేగంగా..

- జిల్లాలో పూర్తికావస్తున్న సదర్‌మాట్ బ్యారేజీ పిప్రి ఎత్తుపోతల నిర్మాణాలు
- చివరి దశలో సదర్‌మాట్ పనులు
- ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ. 14 కోట్లు
- పూర్తయిన అగ్రిమెంట్ ప్రక్రియ
- మరో ఏడు నెలల్లో పూర్తికానున్న పిప్రి ఎత్తిపోతలు
- రెండు పథకాలతో జిల్లాలో అదనంగా 17వేల ఎకరాలకు సాగునీరు

నిర్మల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులను తమ ప్రాధాన్యత క్రమంలో చేర్చడంతో ఆ రెండు ప్రాజెక్టుల పనులు శరవేగంగా సాగుతున్నాయి. సదర్‌మాట్ బ్యారేజీతో పాటు లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకాల పనులను ప్రభుత్వం తన ప్రాధాన్యత జాబితాలో చేర్చడమే కాకుండా ఆ పథకాల పనుల పూర్తికి అవసరమైన మేరకు నిధులను మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో రాబోయే ఏడు ఎనిమిది నెలల్లో ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా నిర్దేశించిన ఆయకట్టుకు సాగునీరు అందించాలని అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలోని మామడ మండలం పొన్కల్ వద్ద నిర్మిస్తున్న సదర్‌మాట్ బ్యారేజీ ద్వారా జిల్లాలో 13వేల ఎకరాలకు, జగిత్యాల జిల్లాలో 5వేల ఎకరాలకు మొత్తం 18వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే లోకేశ్వరం మండలంలోని పిప్రి ఎత్తిపోతల పథకం ద్వారా 4200 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. దీనికి అనుగుణంగా పనులు సైతం మొదలయ్యాయి. అయితే అంచనా వ్యయంను పెంచాలంటూ స్థానిక ఎమ్మెల్యే ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడంతో గత అంచనా వ్యయం కన్నా మరో రూ.75 కోట్లను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. అలాగే ఈ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఎలక్ట్రిఫికేషన్ పనుల కోసం రూ. 1.90 కోట్లతో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపారు. ఈ నిధులు మంజూరు కాగానే ఎలక్ట్రిఫికేషన్ పనులు మొదలుపెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే ప్రభుత్వం తన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో ఈ రెండు ప్రాజెక్టులను చేర్చిన కారణంగా ఇక్కడి అధికారులు పనులను ఏడు ఎనిమిది నెలల్లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ రెండు పథకాలు పూర్తయితే జిల్లాలో దాదాపు 17వేల ఎకరాలకు అదనంగా సాగునీరు అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న క్రమంలో ఇక్కడి చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులకు మహర్దశ పట్టబోనుందని అంటున్నారు.

### సదర్‌మాట్ ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ. 14 కోట్లు

ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన సదర్‌మాట్ బ్యారేజీ నిర్మాణం పనులు చివరిదశకు చేరుకున్నాయి. మొత్తం 670 కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ పథకం పరిధిలో భూసేకరణ కోసం రూ.120 కోట్లను వ్యయం చేశారు. మొత్తం దీనికి సంబంధించి రూ.80 కోట్లను జీఎస్టీ కింద చెల్లించారు. కాగా 120 కోట్లు భూసేకరణ కోసం వ్యయం చేశారు. ఈ ప్రక్రియ దాదాపుగా ముగిసిపోయింది. 399 కోట్లకు గాను రూ.350 కోట్లను ఖర్చు చేశారు. ఇప్పటికే 55 గేట్ల నిర్మాణాల పనులు పూర్తయ్యాయి. దీని సామర్థ్యాన్ని 1.5 టీయంసీలుగా నిర్ధారించారు. కాగా కేవలం ఎలక్ట్రిఫికేషన్ పనులు మాత్రమే మిగిలి ఉన్నందున ఆ పనులను త్వరగా పూర్తి చేసి రాబోయే ఖరీఫ్‌సీజన్‌కు ఈ ప్రాజెక్టు ద్వారా నీరు అందించాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత కొద్దిరోజుల నుంచి అనుమానాలకు తావిచ్చిన ఎలక్ట్రిఫికేషన్ టెండర్‌ల ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయ్యింది. మొత్తం నాలుగుసార్లు అధికారులు టెండర్ ప్రక్రియను నిర్వహించారు. నాలుగోసారికి టెండరు ఖరారయ్యింది. రూ.14 కోట్ల రూపాయలతో ఎలక్ట్రిఫికేషన్ పనులను చేపట్టబోతున్నారు.

### కొనసాగుతున్న పిప్రి ఎత్తిపోతల పనులు

కాగా లోకేశ్వరం మండలం పిప్రి ఎత్తిపోతల పథకం పనులకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఈ పథకాన్ని తన ప్రాధాన్యత క్రమంలో చేర్చిన కారణంగా అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది. మొత్తం ఈ ఎత్తిపోతల పథకం కింద 4200 ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పిప్రి, మేల, నగర్, రాయాపూర్ కాండ్లి, లోకేశ్వరం, ధర్మోరా గ్రామాల్లోని 4200 ఎకరాలకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించనున్నారు. మొదట రూ. 55 కోట్లతో ఈ పథకం నిర్మాణం కోసం అధికారులు అంచనాలు రూపొందించారు. పెరిగిన ధరల కారణంగా అంచనాలను రూ.75 కోట్లకు పెంచాలంటూ స్థానిక ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రభుత్వాన్ని కోరారు. దీంతో ప్రభుత్వం మొత్తం ఈ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయాన్ని రూ. 75 కోట్లకు పెంచుతూ నిర్ణయించారు. కాగా ఈ ఎత్తిపోతల పథకం కింద నిర్మించ తలపెట్టిన ప్రధాన కాలువ పనులు 30శాతం పూర్తయ్యాయి. మొత్తం ఈ కాలువ పొడవు ఏడు కిలో మీటర్లుగా నిర్ధారించారు. ఈ పథకానికి కూడా అవసరమైతే ఎలక్ట్రిఫికేషన్ పనుల కోసం రూ. 1.90 కోట్లను వ్యయం చేయనున్నారు.

### గడువులోగా నిర్మాణాలు పూర్తి చేస్తాం



2025 జూన్ వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రణాళికలు, పనులు అమలు చేస్తున్నాము. ఈ గడువులోగా నిర్మాణాలను పూర్తి చేస్తాం. ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తయితే 18,016 ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగు పడుతుంది.

- సురేందర్ రాథోడ్, డీఈ, సదర్‌మాట్ ప్రాజెక్టు

## పురవీధుల్లో సాయిరథం ఊరేగింపు



సాయిరథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణ పురవీధుల్లో శనివారం వైభవోపేతంగా సాయి రథాన్ని ఊరేగించారు. దత్తసాయి జయంతి సందర్భంగా మహిళలు పెద్దఎత్తున మంగళ హారతులతో, తాళ మేళాలతో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కార్యక్రమంలో సాయి దీక్ష సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి, ఉప్పుల నందు, కోలా శంకర్, ప్రకాష్ గౌడ్, జొన్నల మనోహర్, సాయి మాల ధారణ చేసిన స్వాములు, భక్తులు హాజరయ్యారు. సాయినామంతో పురవీధులు మార్మోగాయి.

## ఘనంగా దత్త జయంతి



దత్త జయంతికి హాజరైన భక్తులు

సారంగాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్యారమూర్‌లో గల దత్తఆశ్రమంలో శనివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దత్త జయంతిని నిర్వహించారు. ఈ నేపథ్యంలో దత్త ఆశ్రమంలో వేద పండితులు పూజలు చేసి ఉయ్యాలలో దత్త విగ్రహాన్ని పెట్టి నామకరణం చేశారు. ఈ దత్త ఆశ్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై మొక్కులను మొక్కారు. దత్త జయంతి ఉత్సవాలకు వచ్చినటువంటి భక్తులు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని చర్యలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కల్లూరులో కొనసాగుతున్న ఉత్సవాలు



కల్లూరు సాయిబాబా ఆలయంలో సాయి నామస్మరణ చేస్తున్న భక్తులు

కుంటాల, డిసెంబరు, 14 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు దత్త వెంకట సాయి మందిరంలో దత్తజయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్స వాల్లో భాగంగా శనివారం శ్రీ మహాపశుపతహోమం, అఖండ సాయినామ సప్తాహ సంకీర్తన, సప్తాహ పారాయణం సమాప్తి, సాయంత్రం ప్రదోషకాల పూజలు, నీరాజన మంత్రపుష్పము, ప్రసాదము, శ్రీ దత్తాత్రేయ స్వామి మహా పూజ గంగాధర్ గిరిధర్ మహారాజ్ కారేగాంచే జరపబడింది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నారు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్న దృష్ట్యా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## నర్సాపూర్(జి) ఎస్సైని సన్మానించిన నాయకులు

నర్సాపూర్(జి), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నూతన ఎస్సైగా సాయి కిరణ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

## పాలిటెక్నిక్ కళాశాలలను ఉన్నతీకరించండి

- మంత్రి సీతక్కకు బీసీ విద్యార్థి సంఘం వినతి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా ఉన్నతీకరించాలని బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యదర్శి ఈసవేణి మనోజ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని 9 పాలిటెక్నిక్ కళాశాలలను ఇంజనీరింగ్ కళాశాలలుగా ఉన్నతీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కానీ ఉమ్మడి జిల్లాను విస్మరించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి పేద విద్యార్థులు హైదరాబాద్ లాంటి పెద్ద నగరాలకు వెళ్లి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మంత్రి సానుకూల నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని కోరారు. మంత్రితో పాటు డీసీసీ శ్రీహరిరావుకు సమస్య వివరించారు.

## విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందించాలి



మామడలో మాట్లాడుతున్న ఆర్‌సీవో గోపీచంద్

మామడ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ఆర్‌సీవో గోపీచంద్ అన్నారు. మహాత్మాజ్యోతి బాఫూలే భోజన మెనూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోన్ సీఐ నవీన్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉందని, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజు, నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, మామడ ఎస్సై సందీప్, ఉపాధ్యాయులు అశోక్, నర్సయ్య, మురళి, పీఈటీ సంతోష్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
నిర్మల్ - 99854 03060
భైంసా - 81258 56776
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్: 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

# పెంచిన డైట్ చార్జీలు అమలు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెంచిన 40 శాతం డైట్ చార్జీలు అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్‌కుమార్ ఆదేశించారు. లోకేశ్వరం మండల కేంద్రం ఎస్సీ బాలుర వసతి గృహంలో కామన్ డైట్ మెనూ శనివారం ప్రారంభించారు. కొత్త మెనూ పాటించాలని ఇబ్బందులుంటే తక్షణం తన దృష్టికి తేవాలన్నారు. మెనూ వివరాలు పాఠశాలలో ప్రదర్శించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. తహ సీల్దార్ మోతిరాం, ఎస్సై అశోక్, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు. వారితో కలిసి అదనపు కలెక్టర్ భోజనం చేశారు.

### విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలి

లోకేశ్వరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ లోకేశ్వరం తహ సీల్దార్ మోతిరాం, స్థానిక ఎస్సై అశోక్‌లతో కలిసి సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేప ట్టిన హాస్టళ్లలో సందర్శనలో భాగంగా తహసీల్దార్ వారానికి ఒకసారి హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శిస్తార న్నారు. ఆహారంలో నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అలాగే ప్రతిరోజు పిల్లలకు గుడ్డుతో పాటు పండ్లు ఇవ్వాలన్నారు. హాస్టళ్లలో ప్రత్యేకమైన ట్యూటర్‌ని నియమించి విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని కోరారు.



సరుకుల నాణ్యత పరిశీలిస్తున్న కిషోర్‌కుమార్

అలాగే పరిస రాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపా లన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## 17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న పెన్షనర్ల సంఘ భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు ఎంసీ లింగన్న తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్, సీనియర్ సివిల్ జడ్జి రాధిక, ఎస్పీ జానకి షర్మిల, తదితరులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. పెద్దసంఖ్యలో పెన్షనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ఎన్‌సీసీ విద్యార్థులకు పతకాలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కస్బా ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పతకాలు సాధించినట్టు ప్రధానోపాధ్యాయులు టి.వాణి తెలిపారు. ఇటీవల 32 బెటాలియన్ పరిధిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచినట్టు తెలిపారు. బి.అక్షిత మొదటిస్థానం సాధించి బంగారు పతకం పొందింది. అలేఖ్య, అమూల్యలు వెండి పతకాలు సాధించినట్టు తెలిపారు. శనివారం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు, ఎన్‌సీసీ అధికారి వై.సాయన్నను అభినందించారు.

## వృద్ధాశ్రమంలో లైబ్రరీ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఏక్తా సంఘం ఆధ్వర్యంలో శనివారం వృద్ధాశ్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ తన పుట్టిన రోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. యువత పుట్టినరోజు సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు షైక్ ముజాహిద్, జావిద్, కౌన్సిలర్ ఇమ్రానుల్లాఖాన్, సభ్యులు మోహిన్, ఫాజిల్ హష్మీ, కాంగ్రెస్ నాయకుడు ఖీజర్, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీబీపీ కానిస్టేబుల్‌గా అంజనీ తండా వాసి



నర్సాపూర్(జి), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంజనీ తండాకు చెందిన జాదవ్ సందీప్ ఎస్ఎస్‌సీజీడీ కేంద్ర పోలీస్ సాయుధ బలగాలు (సీఏపీఎఫ్)లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. కాగా ఆయన తండ్రి జాదవ్ రోహిదాస్ దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వంలో పోలీస్ ఉద్యోగం సాధించడంతో గ్రామస్థులు, మండల ప్రజలు అభినందించారు.

## సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా నర్సాపూర్ వాసి



నర్సాపూర్(జి), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన నీరటిరాకేష్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాడు. ఎస్ఎస్‌సీ జీడీ కేంద్ర సాయుధ బలగాలు (సీఏపీఎఫ్) అంతర్గత భద్రత దళాల్లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్‌ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈయన తండ్రి నీరటి శంకర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో పని చేస్తున్నారు. ఉద్యోగంసాధించడం పట్ల మండల వాసులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామానికి చెందిన ఏ. ముత్తన్న కుటుంబీకులకు శనివారం సీఎం సహాయనిధి లక్ష రూపాయల చెక్కును డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అందజేశారు.

## కామన్ డైట్ మెనూ విధానం ప్రయోజనకరం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఫైజాన్ అహ్మద్

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న కామన్ డైట్ మెనూ విధానం విద్యార్థులకు ఆరోగ్య, విద్యా పరంగా ప్రయోజనం కలిగిస్తుందని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. రాంనగర్ ఆశ్రమ పాఠశాలలో శనివారం డైట్ మెనూ పథకాన్ని ఆవిష్కరించారు. అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుకు వెళ్లి విషయ పరిజ్ఞానం అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, కౌన్సిలర్ వాణి, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలి

లక్ష్మణచాంద, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని ఎస్సై సుమలత శనివారం అన్నారు. యూనిఫామ్ డైట్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ ఉన్నత పాఠశాల, కళాశాలను సందర్శించి విద్యార్థినులతో ఆమె మమేకమై మాట్లాడారు. వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకుని ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు అందజేశారు. మనం తినే ఆహారం పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నవిత, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో..

సారంగాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది అన్నారు. శనివారం మండలంలో స్వర్ణలో గల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సై శ్రీకాంత్, ఎంపీడీవో లక్ష్మీకాంతారావులు విద్యార్థులకు కలిసి భోజనాన్ని చేశారు.

## నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సోఫీనగర్ గురుకులంలో డైట్ మెనూ ప్రారంభించిన చైర్మన్ ఈశ్వర్



నూతన డైట్ మెనూ ప్రారంభిస్తున్న ఈశ్వర్, పక్కన ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం గురుకుల విద్యాలయాల్లో నూతన డైట్ మెనూ అమలు చేస్తోందని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శనివారం సోఫీనగర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆయన ఏఎస్పీ ఉపేందర్‌రెడ్డితో కలిసి నూతన డైట్ మెనూ ప్రారంభించారు. మెనూ అందించేందుకు ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచిందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఒకే రకమైన ఆహారం అందించేందుకు నూతన డైట్ అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని ఉన్నత విద్య అభ్యసించాలన్నారు. మొబైల్ ఫోన్‌ల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులు మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, చదువుపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న నూతన డైట్ మెనూ విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుందని వారికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు గాను డైట్ చార్జీలు 40 శాతం పెంచిందని, కాస్మోటిక్ చార్జీలు 200ల శాతం పెంచినట్టు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ డానియల్, సీఐ ప్రభాకర్ రెడ్డి, సమన్వయకర్తలు రాజేశ్వర్, నర్సయ్య, సలోమి కరుణ, పరీక్షల అధికారి సిద్ధపద్మ, సైన్స్ అధికారి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులతో భోజనం చేసిన ఏఎంసీ చైర్మన్

నూతన డైట్ మెనూ అమలులో భాగంగా శనివారం నిర్మల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి నిర్మల్ సమీపంలోని జ్యోతి బాఫూలే గురుకులంలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో వారికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచడం హర్షణీయమన్నారు. జడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్నారు.

### అనారోగ్యంతో మరణించిన
## ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ఉట్నూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండలానికి చెందిన ఉపాధ్యాయుడు బానోత్ విజయ్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురై అస్వస్థతతో చనిపోవడంతో ఆయన భార్యకు పీఆర్టీయూ సంఘం తరఫున లక్ష రూపాయల ఆర్థికసహాయం అందించారు. విజయ్ మండలంలోని చాందూరి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవారని ఆయన కుటుంబానికిచేదోడు వాదోడుగా ఉండాలని భావించి పీఆర్టీయూ సంఘం తరఫున లక్ష రూపాయలు వారి సతీమణి బానోత్ రమాబాయికి శనివారం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొమ్ముకృష్ణకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి, గౌరవ అధ్యక్షులు గోవర్ధన్, రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షులు విజయ్‌పవార్, మేస్రం శేఖర్‌బాబు, ఉట్నూర్ మండల ప్రధాన కార్యదర్శి జమీందర్, ఉపాధ్యాయులు కృష్ణ, రాథోడ్ కవిత పాల్గొన్నారు.

## నేటి బస్సుజాతా సభను జయప్రదం చేయాలి

ఆదిలాబాద్అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న ఆశల రాష్ట్ర బస్సుజాత సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫిబ్రవరిలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బస్సుజాతసభలో జిల్లాలోని ఆశాలందరు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఇందులో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, నాయకులు శాంత,పద్మ, లక్ష్మీ, పుష్ప, శీరీషా తదితరులు పాల్గొన్నారు.

## లింబు గూడలో అగ్ని ప్రమాదం

తాంసి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్ వల్ల మండలంలోని లింబుగూడ గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారు జామున ఒక్కసారిగా మంటలు చెరేగడంతో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శంబు ఇల్లు కాలిపోయింది. ఇంట్లో ఉన్న వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు నీళ్లు పోసి చల్లార్చారు. సుమారు రెండున్నర లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తాంసి తాజా మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. బాధితునికి నగదు సాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రాజు మాట్లాడుతూ అనుకొని ప్రమాదం వల్ల సంభవించిన నష్టాన్ని ఎవరు పూడ్చలేరని మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. శంబు కుటుంబాన్ని ఆయన ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ కుమార్, సదానందం, రత్న ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

తాంసి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో గిరిజన బాలుర వసతి గృహంలో ఆయన కొత్త మెనూను విడుదల చేశారు. ముందుగా విద్యార్థిని విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు వడ్డించే భోజనం విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్‌లు సురేందర్, హరీష్, తదితరులు ఉన్నారు.

## జంగుబాయి ఆలయం వద్ద ఏర్పాట్లు చేయాలి

ఉట్నూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయం వద్ద ప్రభుత్వం తరఫున సౌకర్యాలు కల్పించి భక్తులకు ఇబ్బందులులేకుండా చూడాలని తుడందెబ్బ ఆదివాసీ నాయకులు పురకబాపురావు కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ మంత్రి సీతక్కకు మండలంలోని షాపూర్‌లో ఆదివాసీ నాయకులు మెమోరాండం సమర్పించారు.

# ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కొత్త మెనూ



రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కొత్త మెనూను ప్రారంభిస్తున్న ఎంపీవో సంతోష్

సిరికొండ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల రాయిగూడ హస్టల్‌లోని విద్యార్థులకు అందించే డైట్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీవో సంతోష్ హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీవో సంతోష్ మాట్లాడుతూ...ప్రభుత్వం వసతి గృహలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల డైట్ చార్జీలను 40 శాతం పెంచిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం వంటగదిని తనిఖీ చేసి, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి భుజించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, పంచాయతీ కార్యదర్శి నీతా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యాసంస్థల్లో సంబరాలు

ఉట్నూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజాపాలన సంబరాలు పురస్కరించుకొని పాఠశాలలు, విద్యా సంస్థల విద్యార్థులకు శనివారం నుంచి ప్రారంభించినకొత్త మెను సంబరాలను మండలంలోని అన్ని పాఠశాల్లో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ లాల్‌టేకిడి గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రత్యేక ఆహ్వానితులుగా అక్కడికి చేరుకున్న జీసీడీఓ మేస్రం చాయకు ప్రిన్సిపల్ ఈమాముద్దీన్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. ఉట్నూర్ మండలంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న బాలికల గురుకుల కళాశాలలో మండలం విద్యాధికారి ఆశన్నను అక్కడ ప్రిన్సిపల్ స్వాగతించారు. సాలెగూడ కోలామ్ శాటిలైట్ సెంటర్‌లో ఏడీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో కొత్త మెను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు సరైన భోజనం అందించడానికి నిధులు పెంచడం హర్షనీయమ న్నారు. పెంచిన మెను ఈ రోజు నుంచి అమలులోకి వస్తుందని విద్యార్థులు ప్రతి ఒక్కరు భాగ చదువుకొని విద్యావంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 'ఇక నాణ్యమైన భోజనం '

భీంపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్టంలోని అన్ని రకాల గురుకులాల్లో ఆశ్రమ పాఠశాలలో నాణ్యమైన బోధించడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. శనివారం భీంపూర్ మండలం లోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో పేద విద్యార్థులకు పోషకాహారం అందించడానికి వసతిగృహాల్లో కొత్తమెనూ ప్రారంభించారు. అలాగే 40 శాతం కాస్మోటిక్ చార్జీలను 200కు పెంచిన నేపథ్యంలో ప్రస్తుతం మెనూలో మార్పులు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి వసతి గృహాల్లో కొత్త మెనూ ప్రారంభం కానుందని, ఒక్కో వారం మెనూ మారుతుండగా.. నెలకు రెండు సార్లు మటన్, చికెన్ విద్యార్థులకు పెట్టనున్నారని తెలిపారు. వీటితో పాటు ఉడికించిన గుడ్లు, బ్రేక్ టైమ్‌లో పండ్లు, మిల్లెట్ బిస్కెట్లు ఇస్తారని తెలిపారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతిగృహాల్లో పోషకాహారంతో పాటు రుచికరమైన భోజనం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మెనూ మార్చిందని అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా కొత్త మెనూ అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. నెలకు రెండు సార్లు లంచ్‌లో మటన్, నాలుగు సార్లు చికెన్ పెట్టనున్నారు. వారానికి ఒక్కో మెనూ..మిగతారోజుల్లో అయితే ఉడికించిన కోడి గుడ్లు, ఫ్రైడ్ ఎగ్ పెట్టనున్నారు. వీటితో పాటు కిచిడీ, చపాతీ, ఇడ్లీ, వడ, పూరి, బోండా, పులిహోరతో పాటు రాగిజావ, పాలు వంటివి ఇవ్వనున్నారు. బ్రేక్ సమయాల్లో ఏదైనా పండు ఇవ్వడంతో పాటు పెసర్లు, బటానీలు, మిల్లెట్ బిస్కెట్లు ఇవ్వనున్నారు. ఇలా ఒక్కో వారానికి ఒక్కో మెనూ ఉంటుంది. ఇప్పటి వరకు నెలకు ఆరుసార్లు చికెన్ పెడుతున్నారు. కానీ ఇకపై మటన్ కూడా పెట్టనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మర్శ కొల మనోహర్, హెచ్ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



అందర్ బంద్ ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి కిషన్

# మురికి కాలువలు శుభ్రం



తాంసిలో కాలువలో మురికి తీస్తున్న దృశ్యం

తాంసి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మండల కేంద్రమైన తాంసిలో మురికి కాలువలను శుభ్రం చేస్తున్నారు. శనివారం ఆంధ్రజ్యోతి అదిలాబాద్ దినపత్రికలో అపరిశుభ్రంగా మురికి కాలువలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన స్థానిక అధికారులు వెంటనే కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయించారు. గత కొన్నిరోజుల నుంచి చెత్త చెదారం పేరుకుపోయి కాలువలన్ని నిండిపోయాయి. దీంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయింది. ఈ విషయాన్ని తెలుసుకుని ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో వెంటనే అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీచేసి మురికి కాలువలను తొలగించారు. దీంతో గ్రామస్తులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నారు.

### అదిలాబాద్ జిల్లా కథలు
## పరిశీలనపై పీహెచ్‌డీ పట్టా ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న ఎర్ల భాగ్యలక్ష్మి

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామానికి చెందిన తెర్ల భాగ్యలక్ష్మికి ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. సోనాల గ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసిన ఈమె పీహెచ్‌డీ ఉస్మానియా విద్యాలయంలో చదవడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కథలు పరిశీలన అనే అంశంపై ఏలే విజయలక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశోధన పూర్తి చేసేందుకు సహకరించిన ఆచార్యులకు రుణపడి ఉంటానని అన్నారు. పట్టా పొందడం పట్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య చింతకింది కాశీం, తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మలు అభినందించారు.

### కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో జరిగే కార్యక్రమానికి
## కౌటా(బీ) నుంచి లడ్డూ ప్రసాదం



బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కౌటా(బీ) గ్రామం నుండి కామారెడ్డి జిల్లా తాడ్వాయి శబరిమాత ఆశ్రమంలో జరిగే కార్యక్రమానికి ప్రతి సంవత్సరం ఇక్కడ తయారుచేసిన లడ్డూలను ప్రసాదంగా పంపించడం జరుగుతుంది. ఈ ఏడాది సహితం కౌటా (బీ)లోని శబరిమాత ఆశ్రమం వద్ద భక్తులు లడ్డు ప్రసాదాన్ని సిద్ధం చేశారు. అయితే ప్రసాదాన్ని విక్రయించగా వచ్చిన డబ్బులను తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమంలో చందా రూపంలో ఇవ్వడం జరుగుతుందని భక్తులు తెలిపారు.

# మంత్రిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

ఉట్నూర్, డిసెంబరు14(ఆంధ్రజ్యోతి):ఉట్నూర్ మండలంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క పర్యటన నేపథ్యంలో స్థానిక అంబేద్కర్‌చౌక్ వద్ద బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నాయకులు సీతక్కను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్న పోలీసులు బీఆర్ఎస్ నాయకులను శనివారం అరెస్టు చేశారు.గోండు కొత్తగూడ నుంచి శ్యామ్‌పూర్ వెళ్లే క్రమంలో ఉట్నూర్ అంబేద్కర్‌చౌరస్తాలో అడ్డుకోవాలని బీఆర్ఎస్ నాయకులు సిద్ధంగా ఉన్నారని గ్రహించిన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పంద్రాజైవంత్‌రావు బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేశ్ మాజీ వైస్ ఎంపీపీ సలీమొద్దిన్‌లు పేర్కొన్నారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజాన్‌తో మృతి చెందిన శైలజ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే 20 లక్షల రూపాయలు అందజేయాలని, అదే విధంగా ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఒక్క గ్యారెంటీ అమలు చేయలేని ప్రభుత్వం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రే రమేష్, కటం రమేష్, కొమ్ము విజయ్, శ్యామ్, క్రాంతి,కుమార్ సోనేరావు, సురేష్, స్వామి, పొన్నసాయి, దినేష్, తజ్, పాండ్‌రంగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బోథ్ మండలంలో..

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండలానికి శనివారం రాష్ట్ర మంత్రి సీతక్క రాను ఉండడంతో మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీతక్క సమావేశంలో అటంకాలు కలిగించే ఆస్కారం ఉందన్న అనుమానంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే జోక్యంతో వీరిని పలు నిబంధనలు పెట్టి విడిచిపెట్టారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బిఆర్ఎస్ మండల రైతు నాయకులు బొడ్డు శ్రీనివాస్, బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## లోక్ అదాలత్‌లో 1221 కేసుల పరిష్కారం

భైంసా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో భారీ సంఖ్యలో కేసులు పరిష్కరమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జీ దేవేంద్ర బాబు సారథ్యంలో ఉదయం వేళ నుంచి సాయంత్రం వరకు లోక్ ఆదాలత్ కొనసాగింది. ఇందులో 38 బ్యాంక్ కేసులు, 24 కాంప్రమైజ్ కేసులు, 74 అడ్మిషన్ కేసులు, 1085 ఎస్‌టీసీ కేసులు కలుపుకొని మొత్తం 1221 కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో భైంసా జూనియర్ సివిల్ జడ్జీ దేవేంద్ర బాబు మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అల్లర్లు, గొడవలు, కోర్టు కేసులు ప్రగతికి అడ్డంకిగా నిలుస్తాయని వివరించారు. కేసుల కోసం కోర్టుల చుట్టూ తిరిగి విలువైన సమయాన్ని,డబ్బును వృథా చేసుకోవద్దని పెర్కొన్నారు. క్షక్షిదారులు, ఫిర్యాదుదారులు సామరస్య పూర్వకమైన రీతిలో రాజీ కుదుర్చుకొని కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. తద్వారా ఇరువర్గాలు విజయం సాధించినట్లవుతుందని వివరించారు.

## రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు

● భైంసా టౌన్ పోలీసు సీఐ గోపినాథ్

భైంసా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగేలా రోడ్లను అక్రమించుకునే వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భైంసా టౌన్ సీఐ గోపినాథ్ వెల్లడించారు. శనివారం పట్టణ పరిధిలో ప్రధాన మార్గంలో రోడ్డును అక్రమించుకొని క్రయ,విక్రయాలు చేపడుతున్న వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. ఇక నుంచి వ్యాపారులెవరు రోడ్లపై తమ వ్యాపారానికి సంబంధించిన వస్తువులు, సరుకులు పెట్టరాదని సూచించారు. తమ తమ వ్యాపార సంస్థ స్థల పరిధిలోనే సరుకులు,వస్తువులు పెట్టుకొని క్రయ, విక్రయాలు జరుపుకోవాలన్నారు. ఎవరైనా వ్యాపారస్తులు తమ దుకాణ స్థల పరిది దాటి రోడ్డును అక్రమించుకొని కొనుగోళ్లు, అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. రోడ్డును అనుకొని ఉంచే వస్తువులు,సరుకులను సీజ్ చేయాల్సి వస్తుందని తెలిపారు. ట్రాఫిక్ వ్యవస్థ మెరుగుదలకు వ్యాపారస్తుల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ వ్యవస్థపై అవగాహన కల్పించారు.

## కామన్ డైట్ మెనూ ప్రారంభించిన డీఎంహెచ్‌వో

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నట్రాజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ వసతి గృహంలో శనివారం కామన్ డైట్ మెనూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజేందర్ ప్రారంభించారు. డైట్ మెనూతో విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమని అన్నారు. మీడియా విస్తరణ అధికారి బి. రవీందర్, వెల్ఫేర్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా దత్త జయంతి

భైంసా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో శనివారం దత్త జయంతి వేడుకలు కన్నుల పండువగా కొనసాగాయి ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లో గల దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాలను శోభయమానంగా అలంకరించారు. ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసి దత్త జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పల్లకి సేవా కార్యక్రమాలను చేపట్టారు. భైంసా మండలంలో హంపోలి గ్రామంలో దత్త జయంతిని పురస్కరించుకొని కొబ్బరికాయలతో అలంకరించి చేపట్టిన ప్రత్యేక పూజలు భక్తులను విశేషంగా అకట్టుకుంది. భక్తుల కోలహాలం మధ్య ఉదయం నుంచి ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు సందడిగా కొనసాగాయి. వేడుకలను పురస్కరించుకొని ఆలయాల్లో భారీగా అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

## ముథోల్‌లో ఘనంగా మహా పడిపూజ

ముథోల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో పశుపతినాథ్ శివాలయం ఆవరణలో శనివారం ముథోల్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన అయ్యప్ప మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ చంద్రమౌళి వెంకటేష్ శర్మ స్వహస్తాల మీదుగా పూజలు ప్రారంభించారు. ముందుగా విఘ్నేశ్వరుడికి, సుబ్రహ్మణ్య స్వామికి, అయ్యప్ప స్వామి ప్రతిమలకు వివిధ రకాల పూలు, పండ్లతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల నుండి దీక్షాపరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు ఆలపించారు. దీంతో 18వ ఏటా నారికేళ స్వాములు వరగంటి వినయ్, రోళ్ల బాలాజీలకు సన్మానించారు.

# హైవే, స్కైవే, ఫ్లైవే లే కాదు.. ఆదివాసీలు నడిచేందుకు దారి నిర్మించాలి

● ఆ దిశగానే ముఖ్యమంత్రి ఆలోచన చేస్తున్నారు ● రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే బ్రిడ్జిల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 1300ల కోట్ల నిధులు కేటాయించింది ● నెలరోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం ● సంక్రాంతి నుండి రైతు భరోసాకు శ్రీకారం : రాష్ట్ర మంత్రి సీతక్క



గంగాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఖానాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పేరిట హైవే, స్కైవే, ఫ్లైవేలు నిర్మించడం మాత్రమే కాదు ఆదివాసీలు నడిచేందుకు కనీసం దారులు నిర్మించాలని రాష్ట్ర మంత్రి సీతక్క అలియాస్ ధనసరి అనసూయ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఎమ్మెల్సీ దండేవిఠల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి కడెం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతమైన గంగాపూర్‌లో సీతక్క పర్యటించారు. ఈ సందర్భంగా కడెం మండలంలోని గంగాపూర్, ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామాల మధ్య రూ. 22 కోట్లతో నిర్మించనున్న వంతెన పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామస్తుతో నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో ప్రజలకు అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు కూడా వెళ్లలేని విధంగా రహదారులు ఉండడంతో తమ ప్రభుత్వం ఆ పరిస్థితి నుండి ప్రజలకు విముక్తి కల్పించే విధంగా ఆలోచన చేస్తోందన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ. 1300ల కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. గతంలో రోడ్ల సౌకర్యం లేక వాగులు దాటలేక ఎంతో మంది గర్భిణీలు పురిటినొప్పులతో చనిపోయిన ఘటనలు తమను ఎంతగానో కలచి వేశాయన్నారు. ఇకపై అటు వంటి పరిస్థితులు పునరావృతం కావద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు విషయంలో వెనకాడడం లేదన్నారు. నెల రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ఆమె పేర్కొన్నారు. రానున్న సంక్రాంతి నుంచి రైతు భరోసా పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణ మాఫీని ఖచ్చితంగా చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు 55 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. మీ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఇచ్చిన మాట మేరకు గంగాపూర్ - ఎర్వచింతల్ గ్రామాల మధ్య రూ. 22 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులను మంజూరు చేశామన్నారు. గంగాపూర్ ప్రాంతానికి ఓ ఆశ్రమ పాఠశాలను మంజూరు చేయించేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. గంగాపూర్ చుట్టుపక్కల గ్రామాల సాగుకోసం లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

### అల్లు అర్జున్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుంది

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటనలో శుక్రవారం ఆ సినిమా హీరో అల్లు అర్జున్ అరెస్ట్ అవ్వడం పట్ల మంత్రి సీతక్క స్పందించారు. అల్లు అర్జున్ అరెస్ట్‌కి తమ ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ఆయన కేసు విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. అల్లు అర్జున్‌మామ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బంధువన్నారు. చిరంజీవి సైతం కాంగ్రెస్ నేపథ్యంలో ఉన్న వారేనని అయినా చట్టపరంగా జరిగే అంశాలపై రాద్ధాంతం తగదన్నారు.

### ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ...


ఖానాపూర్ పట్టణంలో శనివారం ఉదయం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్చీలను కాదని నేలపై కూర్చుని విద్యార్థులతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో అందుతున్న భోజనం, విద్య, తదితర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు.

గంగాపూర్, ఎర్వచింతల్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణం అనేది ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం గంగాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఈ ప్రాంత ప్రజలకు బ్రిడ్జి నిర్మాణంపై బాండ్ పేపర్ రాసి ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కలను నిరంతరం కలుస్తూ బ్రిడ్జి నిరామణానికి రూ. 22 కోట్లను మంజూరు చేయించానన్నారు. తాను అడిగిన వెంటనే గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణక్క, స్థానిక మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, పొద్దుటూరి సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

# చిల్లి గవ్వ లేకుండా శిలా ఫలకాలా ?

● బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకుల పేర్లు ● బీఆర్ఎస్ ఖానాపూర్ మండల నాయకుడు తాళ్లపల్లి రాజగంగన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాళ్లపల్లి రాజగంగన్న

ఖానాపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాకు చిల్లి గవ్వ నిధులు లేకుండా శిలాఫలకాలపై పేర్లు నమోదు చేసుకునేందుకు మంత్రి సీతక్క జిల్లాలో పర్యటిస్తున్నారని బీఆర్ఎస్‌పార్టీ మండలాధ్యక్షులు తాళ్లపల్లి రాజగంగన్న ఆరోపించారు. శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జన్సాన్ నాయక్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తమ హయాంలో నిర్మించిన అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నేతలు తమ శిలాఫలకాలను వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న సీతక్క చిల్లిగవ్వ కూడా జిల్లా అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తానని ప్రకటించకపోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు మంత్రి సీతక్క ఖానాపూర్‌కు 10సార్లు వచ్చిన ఈ ప్రాంత అభివృద్ధి కోసం కనీసం కోటి రూపాయలు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించలేకపోయారన్నారు. ఖానాపూర్ పట్టణంలో రోడ్డు వెడల్పు, అర్బన్ పార్క్ నిర్మాణం, మున్సిపల్ పార్క్ నిర్మాణం, గంగాపూర్ బ్రిడ్జి మంజూరు, పసుపుల బ్రిడ్జి మంజూరు, స్మశాన వాటికల నిర్మాణం ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేస్తే కాంగ్రెస్ నాయకులు వాటికి శిలాఫలకాలు వేసుకొని పేర్లు రాసుకుంటున్నారన్నారు. మంత్రి సీతక్క జిల్లాకు చుట్టం చూపులా వచ్చి పోవడమే కాకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ 8వ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, రైతుబంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ కొక్కుల ప్రదీప్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ శనిగారపు శ్రావణ్ కుమార్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ కారింగుల సుమన్, జిల్లా నాయకులు నసీర్, ఇర్ఫాన్, మేరాజ్, సంద రాకేష్, సల్ల వంశీ, గాజుల అజయ్, సుద్దాల మహిపాల్, రహీమ్, హర్షద్, లాజర్, తదితరులున్నారు.

## డైట్ మెనూను ఖచ్చితంగా అమలు చేయాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురుకులాలు, వసతి గృహాల్లో ప్రభుత్వం రూపోందించిన డైట్ మెనూ ఖచ్చితంగా అమలు పరచాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ స్పష్టం చేశారు. శనివారం భైంసాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కొత్తగా కామన్ డైట్ మెనూను ప్రకటించిందన్నారు. గురుకుల,వసతి గృహాల నిర్వాహకులు డైట్ మెనూ లో లోపాలకు తావులేకుండా చూడాలన్నారు. విద్యార్థులను తమ స్వంత పిల్లలుగా భావించి వారందరికి మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. శుచి, రుచితో కూడిన ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలన్నారు. మెనూ అమలులో లోపాలకు తావిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత, పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ఎప్పుడు గుర్తుపెట్టుకోవాలన్నారు. జీవిత లక్ష్యాన్ని పెట్టుకొని సాధించేందుకు గాను పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన డైట్ మెనూ పట్టికను అవిష్కరించారు. అనంతరం జ్యోతిబాపూలే వసతిగృహంలో అన్ని విభాగాల్లో ఎమ్మెల్యే పాటిల్ కలియ తిరిగారు. నిల్వ సరుకులను, వండిన ఆహార పదార్థాలను, వంటశాలను తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.

## సీఎం సహాయ నిధితో రోగులకు ఆర్థిక భరోసా

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్థిక భరోసా కల్పిస్తున్నామని ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ వెల్లడించారు. శనివారం భైంసాలోని తన క్యాంప్ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల బాధితులకు మంజూరైన అర్థిక సహాయపు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోస్లే నారాయణరావ్ పాటిల్ మాట్లాడుతూ పేద,మధ్య తరగతి ప్రజానీకానికి వైద్యం భారం కాకుడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్థిక సాయం అందించి బాసటగా నిలుస్తున్నామని వివరించారు. ప్రైవేట్, కార్పోరేట్ ఆసుపత్రులలో చికిత్సలు పొందిన రోగులు ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం డిశ్చార్జీ సమ్మరితో పాటు ఇతర ధృవీకరణ పత్రాలతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వైద్య ఖర్చుల విషయంలో రోగులు అర్థికపరమైన ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో తాము సీఎం సహాయ నిధి ద్వారా అదుకుంటున్నామని పేర్కొన్నారు. ఇందులో రోగులు,వారి కుటుంబ సభ్యులు, డివిజన్ పరిధిలో కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదు

● లోకేశ్వరం ఎస్సై జి. అశోక్

లోకేశ్వరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మన్మథ్ ఎక్స్ రోడ్డు వద్ద లోకేశ్వరం ఎస్సై జి. అశోక్, వారి సిబ్బంది శనివారం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎస్సై జి. అశోక్ మాట్లాడుతూ... వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, వాహనాలకు సంబంధించిన నిజ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. ఒకవేళ మద్యం తాగి వాహనాలు నడిపినట్లయితే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# నేటి నుంచి గ్రూప్- 2 పరీక్ష



దీక్ష కళాశాలలో ఏర్పాట్లు చేసిన పరీక్షా కేంద్రం

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- నిర్మల్ జిల్లాలో 24 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరు కానున్న 8080 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు
- కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలో టీజీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్ష నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఆది, సోమవారాలు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 వరకు రోజు రెండు పరీక్షలుంటాయి. పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మౌలిక వసతులు కల్పించారు.

**సిబ్బంది నియామకం...**

పరీక్ష నిర్వహణకు 24 కేంద్రాల్లో విధి నిర్వహణకు సిబ్బందిని నియమించి శిక్షణ పూర్తి చేశారు. 24 మంది చీఫ్ సూపరింటెంట్లు, 26 మంది పరిశీలకులు, 26 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 86 ఐడెంటిఫికేషన్, 4 లోకల్ రూట్ ఆఫీసర్లను నియమించారు. 10 మందితో ఫ్లయింగ్ స్క్వాడ్, 62 మంది బయోమెట్రిక్ సిబ్బందిని నియమించారు. అభ్యర్థులను పరీక్ష సమయానికి అరగంట ముందుగా కేంద్రాల్లోకి క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతిస్తారు.

**కేంద్రాల వద్ద 163 సెక్షన్...**

పరీక్ష జరిగే 24 కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు చేయనున్నారు. సమీపంలో జిరాక్స్ కేంద్రాలు, పుస్తకాల దుకాణాలు, ఇంటర్నెట్ కేంద్రాలు మూసి ఉంచాలని అధికారులు ఆదేశించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసుల పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

**హాజరుకానున్న 8080 మంది..**

రెండు రోజులు జరుగబోయే పరీక్షకు 8080 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలకు మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, స్మార్ట్‌వాచ్, తదితర వాటిని నిషేధించారు. పరీక్ష గదుల్లో తగినంత ఫర్నిచర్ సౌకర్యం కల్పించారు. హాల్‌టికెట్లపై ఇటీవల పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అంటించుకురావాలి. అభ్యర్థులకు బయోమెట్రిక్ హాజరుదృష్ట్యా సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరించనున్నారు.

**కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ...**

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. సజావుగా పరీక్ష నిర్వహించేందుకు సిబ్బందికి శిక్షణలు పూర్తిచేశారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కో-ఆర్డినేటర్ పీజీ రెడ్డిల నేతృత్వంలో కేంద్రాల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బందికి అన్ని ఆదేశాలిచ్చారు. సమన్వయంతో పని చేసి పరీక్ష విజయవంతంగా నిర్వహించాలని, అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచిస్తున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

# డేడ్రాలో మహిళపై చిరుత దాడి


రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న మహిళ

బజార్‌హత్నూర్ / ఆదిలాబాద్‌రూరల్ డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలం పరిధి లోని డెడ్రా గ్రామంలో చిరుతపులి దాడిలో మహిళ తీవ్ర గాయాలైన ఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. శనివారం డెడ్రా గ్రామ వాసి అయిన అరక భూంబాయి (50) మహిళ ఉదయం సమయంలో బహిర్భూమికి వెళ్లగా చిరుతపులి ఆమెపై దాడి చేయడంతో తలభాగంలో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమె అరవడంతో చిరుతపులి దగ్గరలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయిందని, వెంటనే డెడ్రా గ్రామస్థులు గాయాలపాలైన మహిళను మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలిసిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ సిబ్బందితో వెంటనే స్థలానికి చేరుకుని సమీప గ్రామస్థులకు పలుసూచనలు చేశారు. ఒంటరిగా చేన్‌లోకి వెళ్లకూడదని, సాయంత్రం కాకముందు తిరిగి గ్రామానికి చేరుకోవాలన్నారు. పరిసర గ్రామాలైన డెడ్రా మాన్కపూర్, కోసాయిఉమాడ, గిర్జాయి, గ్రామాలవాసులు జాగ్రత్తగా ఉండాలని వారికి సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలో రిమ్స్‌లో ఆమెకు ఆత్యాధునిక చికిత్సను అందించారు. ప్రస్తుతం మహిళ కోలు కుంటుందని ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపారని వారు తెలిపారు. ఫారెస్టు అధికారులు ఆమెకు అత్యవసరంగా ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును ఆమెకు అందించారు. పులి పాదముద్రలను గుర్తించిన అధికారులు చిరుతపులి మహారాష్ట్ర ప్రాంతంలోకి వెళ్లి పోయిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్టు సిబ్బంది బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యం : ఏఎస్పీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏఎస్పీ

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పౌష్టికాహారం అందించేందుకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందని ఏఎస్పీ సురేందర్‌రావు అన్నారు. శనివారం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. జిల్లాలోని వసతిగృహాల్లో ఈ కార్యక్రమానికి అధికారులు పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేసి ప్రారంభించారు. కాగా కోలాం ఆశ్రమ పాఠశాలలో కార్యక్రమ లాంచింగ్‌లో ఏఎస్పీ సురేందర్‌రావు పాల్గొన్నారు. ముందుగా ప్రభుత్వం నుంచి వచ్చిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రాసెస్ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించి మెను గురించి వివరించారు. అనంతరం ఏఎస్పీ సురేందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల డైట్ వల్ల కలిగిన అనర్థాలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.అదే విధంగా ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. దీనికి గాను ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నారాయణరావు, ఉపాధ్యాయులు సురేందర్, ప్రభాకర్, హరిదాస్, భుజంగ్‌రావు, విలాస్, రమేస్, వార్డెన్ ప్రభాకర్ తదితరులున్నారు.

**ఆరోగ్యం పట్ల జాగ్రత్త**

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తూ, చదువుల్లో ఉన్నతంగా రాణించాలని మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో ఏర్పాటు చేసిన నూతన కామన్ మెనూ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందించడానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీపీఓ సుమలత, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

**సమీకృత బాలికల వసతి గృహంలో..**

సమీకృత బాలికల వసతి గృహం, కళాశాలలో శనివారం 40శాతం డైట్‌చార్జీల పెంపు, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఎం సుధారాణి, ఎంపీడీవో కె.శంకర్ హాజరై కామన్ డైట్ మెనూ ప్రారంభించారు. కార్యక్రమంలో పి.రాధ, వసతి గృహం సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి


ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దాసరి ప్రసాద్

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి కృషి చేస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి ప్రసాద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను శనివారం స్థానిక టీటీడీసీలో ప్రారంభించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సైన్స్‌తో పాటు జన విజ్ఞాన వేదిక చేస్తున్న పనులను విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. 33 జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చి వారి ప్రదర్శనలను ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పై అవగాహన పెంచడం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, చీఫ్ సైంటిస్టు రాధ, జిల్లా సైన్స్ అధికార రఘురమణ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్,రాజు, బీఎన్‌రెడ్డి, రవీందర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకాంత్, పెంటపర్తి ఊశన్న,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితులే కాకుండా అక్షరాస్యతలో వెనుకబడ్డ ఆదివాసులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తలమడుగు శాఖ స్పెషల్ ఆఫీసర్ కాడే స్వామి అన్నారు. శనివారం మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని ఆదివాసి గిరిజన స్కూల్ పిల్లలకు 25 వేల విలువ గల స్వెటర్‌లు, స్కూల్‌బ్యాగులు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాడేస్వామి మాట్లాడుతూ చలి తీవ్రత దృష్ట్యా ఆదివాసి గిరిజనుల స్కూల్ పిల్లలు, వృద్ధులు పడుతున్న అవస్థలు తనను చలింపజేశాయని అందుకే తన వంతు సహాయంగా ఈ చిన్న సహాయాన్ని అందించానని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్రావు, జగిత్యాల జిల్లా తహసీల్దార్ విశ్వంభర్, మాల సంక్షేమ సంఘం మాజీ మండల అధ్యక్షులు నేతుల గంగన్న, తుడుం దెబ్బ డివిజన్ ప్రధాన కార్యదర్శి కుమ్రా జ్ఞానేశ్వర్, గ్రామ పటేల్ మేస్రం నాగోరావు మహాజన్, ప్రసాద్, గటియా కోసే రావు పాల్గొన్నారు.


ఆదివాసీ గిరిజనులకు స్వెట్టర్లను పంపిణీ చేస్తున్న కాడేస్వామి


భగవద్గీతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

## అయ్యప్ప స్వాములకు భగవద్గీత పంపిణీ

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోనాల మండల కేంద్రంలో శనివారం ఈర్ల అభిలాష్ కన్నె స్వామి అయ్యప్ప స్వాములు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. భిక్ష అనంతరం స్వాములందరికీ భగవద్గీత అందించడం జరిగింది. నిత్యజీవితంలో భగవద్గీతకు ఉన్న అనుబంధాన్ని గుర్తించి భగవద్గీతను అందించడం జరిగిందని దాతలు పేర్కొన్నారు.

# చల్లటి నీళ్లతోనే స్నానం

- ఉమ్రి బాలికల పాఠశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



ఉమ్రి ఆశ్రమ పాఠశాల



అధ్వానంగా ఉన్న వంట గది

తలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రత తగ్గిపోవడంతో ఇంటి నుంచి జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. అలాంటి చలిలో ఆశ్రమ పాఠశాలలో చదివే బాలికలకు చల్లటి నీటితో స్నానం చేయాలంటే ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్రి గ్రామంలో గల గిరిజన అభివృద్ధి సంస్థ బాలికల పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సోలార్ మీటర్ వాటర్ ట్యాంకు కొన్ని నెలలుగా మరమ్మతులకు గురికావడంతో ఆ వాటర్ ట్యాంకును ఎవరూ మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి మరమ్మతుతో పాఠశాలలో చదివే 250 మంది బాలికలకు వేడినీరు రాకపోవడంతో ఎముకలు కొరికే చలిలో చల్లటి నీటితో స్నానాలు చేస్తున్నారు. అసలే చలికాలం. జ్వరాలు వస్తే ఇబ్బందులే. సోలార్ వాటర్ మీటర్‌ను మరమ్మతు చేయించాలని పలుమార్లు ఐటీడీఏ అధికారులకు విన్నవించిన ఎవరూ పట్టించుకోవడం లేదు. రూ.లక్షలతో ఏర్పాటు చేసిన సోలార్ వాటర్ హీటర్‌ను నిర్లక్ష్యంగా వదిలివేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే విధంగా ఆశ్రమ పాఠశాల బాలికల విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం బ్లాంకెట్లను పంపిణీ చేస్తున్నప్పటికీ ఈ సంవత్సరం ఇంత వరకు బ్లాంకెట్లను పంపిణీ చేయకపోవడంతో చలికి వణికి పోతున్నామని విద్యార్థులు తెలిపారు. జిల్లాలోనే ఉమ్రి, కోసాయి గ్రామాల్లో ఎక్కువగా చలితీవ్రత ఎక్కువగా ఉంది. అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో వంట షెడ్డు మరమ్మతులకు గురైన ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఉమ్రి బాలికల పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ ట్యాంకును మరమ్మతు చేయించి పాఠశాల విద్యార్థులకు వేడి నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

**● మరమ్మతు చేపట్టాలని అధికారులకు విన్నవించాం**

ఉమ్రి బాలికల పాఠశాలలో గత నాలుగు నెలలుగా సోలార్ వాటర్ మీటర్ ట్యాంకు మరమ్మతులకు గురైందని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేపట్టగానే విద్యార్థులకు వేడి నీరును అందించేందుకు చర్యలు చేపడుతాం. ఐటీడీఏ అధికారులు విద్యార్థులకు స్వెటర్లు, చెద్దర్లు పంపిణీ చేశారు.

**- హీరమాన్, హాస్టల్ వార్డెన్**


మరమ్మతులకు నోచుకోని సోలార్ వాటర్ హీటర్

## నేడు సాయిలింగిలో బ్రహ్మోత్సవాలు

తలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడు గు మండలం సాయిలింగి గ్రామంలో సాయిబాబా ఆలయ 24వ వార్షికో త్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దేబిడి అశోక్ తెలిపారు. మూడు రోజులుగా ఆలయంలో వేద పండితులతో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగిందన్నారు. చివరి రోజున ఆదివారం యజ్ఞ పూర్ణవతి, సాయి బాబా పల్లకి ఊరేగింపు, మహా అన్నదానం నిర్వహించడం జరుగుతుం దన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా జాతర ఇతర సాంస్కృతిక సాంప్రదా య కార్యక్రమాలు. నిర్వహిస్తున్నమని. తెలిపారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు. భక్తులు తరలివస్తున్నా రన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలి

తలమడుగు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని సద్గురువు సోనామాత అన్నారు. శనివారం మండలంలోని బరంపురం శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ నేటి ఉరుకులు పరుగులు జీవితంలో మనిషికి మనశ్శాంతి. లేకుండా పోయిందన్నారు. దీనివల్ల కొంతమంది అనారోగ్యలపాలు అవుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మనశ్శాంతిగా ఉండాలంటే ఆధ్యాత్మిక మార్గం ఉత్తమమన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదేవిధంగా సద్గురు నారాయణ బాబా సంస్థాన్ పలిసిబి తండా ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థాన్, అధ్యక్షులు జాదవ్ కిషన్, ఉపాధ్యక్షులు పోచ్చన్న, బరంపూర్ ఆలయ కమిటీ అధ్యక్షులు కేదారేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు మల్లేష్, ప్రతాప్, రాజు, నాగారెడ్డి, రమాకాంత్ ఆలయ పూజారి స్వస్తిక్ స్వామి మహిళ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌అదాలత్‌కు భారీ స్పందన : ఎస్పీ గౌస్‌ఆలం

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ ఆదాలత్‌కు జిల్లా ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. శనివారం పోలీసు ముఖ్య కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో విడుదల చేస్తూ లోక్ ఆదాలత్ కార్యక్రమంలో పరిష్కరించిన కేసుల వివరాలు వెల్లడించారు. జిల్లాలో పరిష్కరించిన కేసులు మొత్తం 1732 కేసులు గుర్తించినట్లు తెలిపారు. జిల్లా పోలీసు వ్యవస్థతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ లోక్ ఆదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్‌రావు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థకు పోలీసు శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు డ్యూటీ విధులను పర్యవేక్షిస్తూ లోక్ ఆదాలత్ విజయవంతం కావడానికి కృషి చేసిన డీసీఆర్‌బీ డీఎస్పీ బి.సురేందర్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సైబర్ క్రైమ్ డీఎస్పీ హసి బిల్లా, సిబ్బందిహకీం, వెంకటమ్మ, సుభాష్ యాదవ్, శేఖర్, వెంకటేశ్, సిబ్బందిని అభినందించారు.

**జాతీయ లోక్ అదాలత్ సరైన వేదిక : న్యాయాధికారి ప్రభాకర్ రావు**

**ఆదిలాబాద్ రూరల్ :** పరస్పర రాజీ మార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలంటే జాతీయ లోక్ అదాలత్ సరైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని సమావేశ మందిరంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. అనంతరం పలు కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు.

# పూలాజీ బాబా జెండావిష్కరణ


జెండాను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ఆంజీ గ్రామంలో దత్త జయంతిని పురస్కరిం చుకుని శనివారం పరమహంస సద్గురు పూలాజీబాబా ధ్యాన కేంద్రం 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పూలాజీ బాబా జెండా ఆవిష్క రించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ గారుశే దశరథ్, ఆదివాసీ ఆంధ్ సంఘం జిల్లా అధ్యక్షులు ముఖడే విష్ణు, పుండలిక్, బాలాజీ, వామన్, సంజీవ్ పాల్గొన్నారు.

**పాస్‌పోర్టు పోయినది**

నేనుతి అనగా RUSUNKUNTE RAMULU S/O RUSUNKUNTE SAYILU, AGE: 31 YEARS, H.NO. 10, VILLAGE: GANDHINAGAR, MANDAL: SOAN, DIST. NIRMAL, T.S. నాయొక్క ఇండియన్ పాస్‌పోర్టు నెం. N0496171 గల పాస్‌పోర్టు తేది 20.09.2024 రోజున గాంధీనగర్ గ్రామం నుండి సోన్ మండలానికి బైక్ పై ప్రయాణించగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. Cell: 9133241647

## ఘనంగా దత్త జయంతి వేడుకల ప్రారంభం

తాంసి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలం గిరిగామ్‌లో శ్రీ దత్తాత్రేయ ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే జాతర వేడుకలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. అభిషేకం, హోమం, కుంకుమార్చన వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జాతరను నిర్వ హిస్తారు. కాగా మాజీ జడ్పీటీసీ రాజు దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ పూజారి సుధాకర్, వేదపండితులు జోగుగంగాధర్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జోగు గం గాధర్ మాట్లాడుతూ జాతర సందర్భంగా ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల వివరాలను తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దత్తాత్రేయుడిని దర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

**ఇంద్రవెల్లి :** మండల కేంద్రంలో దత్త జయంతి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భజన, సంకీర్తనలతో పల్లకీ ఊరేగింపును ప్రధాన వీధులగుండా నిర్వహించారు. మహిళా భక్తులు నిండు కలశాలతో పల్లకికి స్వాగతం పలికారు. ముందుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి దేవతలను భక్తులు దర్శించుకున్నారు. ఉదయం అభిషేకం, యజ్ఞం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.


పల్లకి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

**CLASSIFIEDS**

**ఎస్.ఎస్.సి.మెమో పోయినది**

జాదవ్ సరస్వతి D/o జాదవ్ మోహన్ R/o H.NO. 8-49/4, గ్రా. దన్నూర్‌బి, మం. బోథ్, జి. ఆదిలాబాద్. అనే నేను నాయొక్క ఎస్.ఎస్.సి ఒరిజినల్ మెమో దన్నూర్‌బి గ్రామము నుండి బోథ్‌కు బస్సులో వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికినవారు ఇస్తే వారికి తగిన పారితోషికం ఇవ్వ బడును. నం. 7702190212

AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్




**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
ఆదిలాబాద్ : 99854 11291, నిర్మల్ : 80966 77672



## 16 వరకు పత్తి కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న స్వప్నసాయి దత్త జిన్నింగ్ మిల్లులో ఈనెల 16 వరకు పత్తి పంట కొనుగోలును నిలిపి వేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్ తెలిపారు. అంతేగాక ప్రతి శని, ఆదివారాలలో సీసీఐ ద్వారా పత్తి పంట కొనుగోలు జరగవని ఆయన తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి పత్తిని తీసుకురావద్దని కోరారు.

# పంజా విసురుతున్న.. చలి పులి!



జిల్లా కేంద్రంలో కనిపిస్తున్న దట్టమైన పొగమంచు



పట్టణంలో చలి మంటలు కాగుతున్న ప్రజలు

- జిల్లాలో 6.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదు
- శీతల గాలుల ప్రభావంతో పెరుగుతున్న చలి తీవ్రత
- మారుమూల గిరిజన గ్రామాల్లో దట్టమైన పొగమంచు
- అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యుల హెచ్చరికలు

ఆదిలాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) :
జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతోంది. దీంతో రాత్రి, పగలు అనే తేడా లేకుండానే చలితో జనం గజ గజ వణికిపోతున్నారు. రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. గత వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో చలి ప్రభావం విపరీతంగా కనిపిస్తోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులేకపోయినా కనిష్ఠ ఉష్ణోగ్రతల పతనం కనిపిస్తోంది. రాత్రుళ్లతో పాటు పట్ట పగలు కూడా చలిమంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందుతున్నారు. చలి తీవ్రత పెరిగి పోవడంతో వేడి నీళ్లతోనే స్నానాలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. అయితే వసతి గృహాలు, గురుకులాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు ఉదయం పూట చన్నీళ్ల స్నానాలు చేస్తూ వణికి పోతున్నారు. అలాగే మార్నింగ్ వాక్ చేసేవారంతా సూర్యుడు ఉదయించిన తర్వాతనే ఆలస్యంగా బయటకు వెళ్తున్నారు. గత వారం రోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో చలిగాలుల తీవ్రత పెరిగింది. శనివారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 6.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడం ఈ సీజన్‌లో ఇదే మొదటి సారి. ప్రతీయేటా డిసెంబరులోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడం కనిపిస్తోంది. ముఖ్యంగా డిసెంబరు 19, 20, 21, 22 తేదీల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోయే అవకాశం ఉంది. జిల్లాలో వానాకాలం, శీతాకాలం, వేసవి కాలం మూడు కాలాలు అధిక ప్రభావాన్నే చూపుతాయి. దీంతో వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చలి తీవ్రత పెరిగిపోవడంతో కొందరు దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు వెచ్చని దుస్తులను పంపిణీ చేస్తున్నారు. చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండడంతో వృద్ధులు, చిన్న పిల్లలు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### శీతల మాసంగా డిసెంబరు

ప్రతీ యేటా డిసెంబరులోనే చలి తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. డిసెంబరు 20 వరకు కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు పడిపోవడం కనిపిస్తోంది.

**డిసెంబరు 10 నుంచి జిల్లాలో నమోదైన కనిష్ఠ ఉష్ణోగ్రతలు**

| తేదీ | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| డిసెంబరు 10 | 30.3 | 12.2 |
| డిసెంబరు 11 | 27.8 | 9.7 |
| డిసెంబరు 12 | 28.3 | 7.2 |
| డిసెంబరు 13 | 28.0 | 8.7 |
| డిసెంబరు 14 | 27.3 | 6.2 |

గతేడు 3 నుంచి 5 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠంగా బేల మండలంలో 6.6 డిగ్రీలు, భీంపూర్ అర్లి(టి)లో 6.9, ఆదిలాబాద్ రూరల్‌లో 7.1, మావలలో 7.2, జైనథ్‌లో 7.3, బజార్‌హత్నూర్‌లో 7.4, నేరడిగొండలో 7.8, తలమడుగులో 8.0, గాదిగూడలో 8.9 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతతో జిల్లాలో ఎల్లో, ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటిస్తున్నారు. ఉత్తర భారతదేశం నుంచి వీచే శీతలగాలుల ప్రభావం జిల్లాపై మరికొన్నాళ్ల పాటు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ యేటా జిల్లాలో డిసెంబరుతో పాటు జనవరి మాసాన్ని అతిశీతల మాసాలుగా పరిగణిస్తారు. అయితే గతంలో ఫిబ్రవరిలోనూ 6.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన దాఖలాలు ఉన్నాయి. వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకోవడం కూడా చలి తీవ్రతకు ప్రధాన కారణమంటున్నారు.

### కప్పేస్తున్న పొగమంచు

మారుమూల గిరిజన గూడాలను పొగమంచు పూర్తిగా కప్పేస్తోంది. దీంతో చలి తీవ్రత విపరీతంగా పెరిగి పోతుందంటున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో వెచ్చని దుస్తులను ధరించి చలి నుంచి కాపాడుకుంటున్నారు. అలాగే పశువులు కూడా చలికి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉండడంతో రాత్రి వేళల్లో పశువుల పాకలు, ఇళ్లలోనే పశువులను ఉంచుతున్నారు. రైతులు పశువులకు గోనె సంచులు కప్పి వెచ్చదనాన్ని కల్పిస్తున్నారు. ముఖ్యంగా బేల, జైనథ్ మండలాలతో పాటు బోథ్ మండలం గుర్రాల తండా, తలమడుగు మండలం కోసాయి, ఉమ్రి, భీంపూర్ మండలం అర్లి(టి) గిరిజన గ్రామాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం 4 గంటల నుంచే చల్లని ఈదురు గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. చలి నుంచి కాపాడుకునేందుకు గిరిజన గూడాల్లో ఇంటింటికీ చలి మంటలు వేసుకుంటున్నారు. రాత్రిళ్లు భోజనం కూడా చలి మంటల వద్దనే కానిస్తున్నారు. ప్రధానంగా ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో దట్టమైన అడవులు, నదులు, వాగులు, చెరువులు ఉండడంతో చలిగాలుల తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం 10 గంటల వరకు గ్రామాల పరిసర ప్రాంతాలు దట్టమైన పొగమంచుతోనే కనిపిస్తున్నాయి. ఈ దృశ్యాలను చూస్తే మరో కశ్మీర్‌లా కనిపిస్తోంది. అలాగే 44వ జాతీయ రహదారిపై పొగమంచుతో ఉదయం పూట రాకపోకలకు కొంత ఇబ్బందికరంగా మారిందంటున్నారు. పొగమంచు సమయంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

**చలి తీవ్రత మరింతగా పెరిగే అవకాశం**

**• శ్రీధర్ చౌహాన్, వాతావరణ శాఖ సీనియర్ శాస్త్రవేత్త**

రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. ప్రతీయేటా డిసెంబరు మాసం చివరిలోనే ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతాయి. దీంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. శీతల గాలులతో జిల్లాపై చలి ప్రభావం కనిపిస్తోంది. జిల్లాలో సాగు చేస్తున్న పత్తి పంటకు చలిగాలులు అంతగా అనుకూలం కాకపోయినా శనగ పంటకు మేలు జరుగుతోంది. కొన్ని రకాల పంటలను చీడపీడలు అధికంగా ఆశించే అవకాశం ఉంటుంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు వృద్ధులు అవసరమైతేనే బయటకు వెళ్లాలి.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**● రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి**



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి

ఇంద్రవెల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన తరుణంలో శనివారం మండలంలోని ముత్నూర్ గ్రామంలోని తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల /కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఈశ్వరి బాయికి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన డైట్ జాబితాను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ రేపటి భావి భారత పౌరులను తీర్చి దిద్దాలనే లక్ష్యంతోనే వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థుల డైట్‌చార్జీలు పెంచడం సంతోషకరమని ఆమె అన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దానికనుగుణంగా విద్యార్థులు బాగా చదివి ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆమె అన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలను తిలకించారు. కార్యక్రమంలో సిడిపివో ఉమా దేవి, ఇంచార్జి ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ విజయ, ఉపాధ్యాయులు కృష్ణవేణి, మాధవి, వార్డెన్ భార్గవి, సౌమ్య ఉన్నారు.

## లోక్ అదాలత్‌తో సమయం ఆదా.. సత్వర న్యాయం

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయంతో పాటు సమయం ఆదా అవుతుందని బోథ్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మౌనిక పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదాలత్‌ల ద్వారా కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. శనివారం నిర్వహించిన అదాలత్ అడ్మిన్‌లో 265 కేసులు, సీసీ అడ్మిన్‌లో 21 కేసులు, ఎక్సైజ్‌కు సంబంధించి 17 కేసులు, బ్యాంక్ రికవరీకి సంబంధించిన 28 కేసులు, సివిల్ తగాదాలకు సంబంధించిన రెండు కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు.

**ఉట్నూర్ :** లోక్ ఆదాలత్‌లో 144 కేసులు పరిష్కరించడం జరిగిందని ఉట్నూర్ మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, జూనియర్స్ సివిల్ జడ్జి మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రం లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 17 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు.

## వసతి సౌకర్యాలను వినియోగించుకోండి

**● జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి**



మెనూ జాబితాను ప్రదర్శిస్తున్న జేసీ, ఉపాధ్యాయులు

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం హాస్టల్‌లో గురుకులాలు, వివిధ సంక్షేమ హాస్టళ్లల్లో సర్వే విద్యార్థుల కోసం నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు ఎన్నో రకాల వసతులను కల్పిస్తున్నాయని, వాటిని వినియోగించి ఉన్నతులుగా, ఉత్తమపౌరులుగా ఎదగాలని ఆదిలాబాద్ అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గురుకుల కళాశాలలో భోజనం నాణ్యతను పరిశీలించారు. అంతేగాక విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువులు ఎలా సాగుతున్నాయి, భోజనాలు ఏ విధంగా ఉన్నాయి అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ కళాశాలలోని కిచెన్ గదికి వెళ్లి వంట నాణ్యతను పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వపరంగా నూతనంగా ఇటీవల విడుదల చేసిన డైట్‌మెనూ చార్ట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా భోజన వసతి పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తపరిచి ప్రిన్సిపాల్ సంగీతను అభినందించారు. పేదపిల్లలకు సరైన విద్య అందే విధంగా చూడాలని కోరారు. ఆమె వెంట ప్రత్యేక అధికారి మహమ్మద్ రహీద్, ఎంపీడీవో రమేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, మాధవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# మహిళల రక్షణ కోసం దళాల ఏర్పాటు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క



అర్బన్ పార్కులో వాహనంపై మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్

**● రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**
**● జిల్లాలో పలు కార్యక్రమాల్లో మంత్రి బిజీ బిజీ**

ఉట్నూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిషలు కృషిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే రోజుల్లో మహిళా రక్షణ కోసం మహిళా రక్షణ దళాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలకు హాజరైన సందర్భంగా షాంపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శనివారం రూ.11.66కోట్లతో జరుగ నున్న అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, అసిస్టెంట్ కలెక్టర్ మాలవీయ, డీఎస్పీ నాగేందర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం సుగుణక్క, ఆత్రం రాహుల్, ఖయ్యుం, ఎస్పీరెడ్డి, రాజేశ్ నాయక్, జగదీశ్‌జాదవ్, సునిల్‌జాదవ్ పాల్గొన్నారు.

**ఇంద్రవెల్లి :** గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని గిరిజన సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దాండే విఠల్‌తో కలిసి మండలంలోని శంకర్‌గూడ గ్రామాన్ని సందర్శించి రూ.కోటి రెండు లక్షల నిధులతో మంజూరైన దుబ్బగూడ, బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్,కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముఖడే ఉత్తమ్, నాయకులు ఎం.డి.మసూద్, జితేందర్, కొరెంగ సుంకట్‌రావు తదితరులు ఉన్నారు.

**కష్టపడే వారికి గుర్తింపు..**

**ఇచ్చోడ :** కష్టపడే వారిని కాంగ్రెస్ పార్టీ గుర్తుపెట్టుకుంటుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన మార్కెట్ కమిటీ ఛైర్మెన్ పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపాలన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. మార్కెట్ ఛైర్మెన్ సత్య వతితో పాటు వైస్ ఛైర్మెన్, సభ్యులు తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీఎంపీ సోయం బాపురావ్, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్సీ దండె విఠల్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, నాయకులు సత్తు మల్లెష్, సుగుణక్క, గోక గణేష్‌రెడ్డి, మహిమూద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

**చిన్నవయసులో పెళ్లిచేస్తే జైలు శిక్ష తప్పదు..**

**బోథ్ :** చిన్నతనంలో 18 సంవత్సరాలు పెండ్లి చేస్తే తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం బాల్యవివాహాలను తగ్గించాలన్న ఉద్దేశంతో కల్యాణలక్ష్మి పథకం ద్వారా తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ ద్వారా అన్ని చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో శాసనసభ్యులు జాదవ్ అనిల్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు అండగా నిలవడం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, కలెక్టర్ రాజర్షిషా ఎస్పీ గౌస్ అలం, ఆడియో వినోద్‌తో పాటు తహసీల్దారులు పాల్గొన్నారు. అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రభుత్వ పథకాల అమలులో ముందున్నారన్నారు. మరోవైపు పాఠశాలలను సందర్శించడంతోపాటు అంగన్వాడి కేంద్రాలను వాటి నిర్వహణను పరిశీలించడం అభినందనీయమని పేర్కొన్నారు. రేంజ్ పరిధిలోని ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ పార్కును శనివారం సాయంత్రం రాష్ట్రమంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న సఫారీలో వెళ్లి అర్బన్ పార్కును పరిశీలించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డి.ఎఫ్.ఓ రేంజి అధికారి ప్రణయ్, సిబ్బంది ఉన్నారు.

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి సీతక్క**

**నేరడిగొండ :** వసతి గృహాల్లో నాణ్యతతో కూడిన భోజనం అందించడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. నేరడిగొండ మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సీతక్క శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామన్‌డైట్ మెను కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను టీచర్స్ రోజు వస్తున్నారా...? పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారా.... ? ఇప్పటి వరకు ఎన్ని చాప్టర్లు అయ్యాయి... భోజనం సౌకర్యం, ఇతర మౌలిక సదుపాయాల విషయాలను అడిగి తెలుసుకున్నారు. మెను మారిందని విద్యార్థులకు రాగి జావా, కోడి గుడ్లు చికెన్ కర్రీ, మటన్ బటర్ మిల్క్ అందించడం జరుగుతుందని, ఆహార భద్రత కమిటీ ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు జాదవ్‌అనిల్, వెడ్మబొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గ్రంథాలయ ఛైర్మన్ సత్తుమల్లేష్, మాజీ ఎంపీ సోయంబాపురావ్, నాయకులు ఆడే గజేందర్, రాథోడ్‌సజన్, ఆడేవసంత్‌రావ్, బొడ్డుమల్లేష్, బొడ్డు గంగారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజార్షిసా, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, డీఎస్పీ నాగేంద్ర, డీఎఫ్‌వో, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ఆర్డీఓ వినోద్‌కుమార్, తహసీల్దార్ కలీం, ఎంపీడీవో రాజ్‌వీర్ తదితరులున్నారు. తమ డిమాండ్లు నేరవేర్చాలని ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1200 మంది సీఆర్టీలు ఆందోళన బాట పట్టనున్నారు. సీఆర్టీల యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగనున్నారు. శనివారం మండలంలోని లకంపూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చిన మంత్రి సీతక్కకు సీఆర్టీలు సమ్మె నోటీసుఅందజేశారు. కొత్త డైట్ మెనూ ప్రారంభోత్సవానికి మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలకు ఆ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రాగా స్వాగతం ద్వారం వద్ద స్థానిక ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేరు గాని ఫ్లెక్సీలో ఫొటోలేకపోవడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఇచ్చోడ సీఐ భీమేష్ కల్పించుకుని కార్యకర్తలను సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది.

## అయ్యప్పస్వాములకు షెడ్ నిర్మాణం : ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోనాల మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో అయ్యప్పస్వాముల కోసం సన్నిధానం కోసం షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరుకు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఒప్పుకున్నారని సోనాల మండల టీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యేను కలిసి అయ్యప్ప స్వాముల కోసం షెడ్డు సన్నిధానం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**● స్పెషల్ ఆఫీసర్ గంగాధర్**

నార్నూర్, డిసెంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు ఉన్న సమస్యలు అధికారులు తెలుసుకోవాలని ఆదేశాలు ఉండడంతో శనివారం మండలంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో స్పెషల్ ఆఫీసర్ గంగాధర్ ఆశ్రమ పాఠశాల బాయ్స్‌లో ఎంపీడీవో జవహర్ తనిఖీ చేశారు. ముందుగా ఆవరణ స్వచ్ఛత, పరిశుభ్రతను అలాగే స్టోర్ రూంలోని బియ్యం, కూరగాయాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు వారు పరిశీలించారు. విద్యార్థుల కోసం ఆహారం సిద్ధం చేస్తుండగా నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రతిరోజు వారికి నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారివెంట తహసీల్దార్ రాజలింగు,అధికారులు, గ్రామస్థులు విద్యార్థులున్నారు.

సదా మీ సేవలో...
పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నా మరియు కొత్త కాపీ బుక్ చేసుకోవడానికైనా ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..
ఆదిలాబాద్ - 93983 85917
ఇచ్చోడ - 85000 38312
అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454
బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451